క్లుప్తంగా

ఘనంగా పట్టాబమ్మ ఉత్సవాలు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామంలో పట్టాబమ్మ పేరంటాలు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పంచ మడపళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన కిమిడి విశ్వేశ్వర రావు, శ్రీదేవి దంపతులు వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో కె.శ్రీరామ్మూర్తి, కె.వెంకట మురళీధరరావు, డి.సత్యంనాయుడు, కె. మధుబాబు, పి.తిరుపతినాయుడు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి



నిర్మాణ దశలోని కలెక్షన్ సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: మండలంలో చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్ భవనాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంలు ఎం.చక్రపాణి, బి.గోవిందరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: మండలంలోని దేవుదల, అప్పాపురం, మజ్జిరాముడుపేట, గుళ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనదారులంతా రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం, సాయంత్రం వేతనదారుల హాజరు, ఫొటోను అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు.

ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బొబ్బిలి రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలంతా తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్.రాజారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.లక్ష్మి, అంగన్‌వాడీ సంఘ నాయకులు కామేశ్వరి, ప్రసన్న, నిర్మల, ఉమ, పద్మ పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై అభిప్రాయ సేకరణ



భూముల సర్వేపై రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకుంటున్న అధికారులు

బాడంగి: త్వరితగతిన భూముల రీసర్వే చేపట్టాలని కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని బాడంగి, ముగడ, ఆకులకట్ట గ్రామాల్లో భూముల రీసర్వే కొనసాగుతుండగా, ముగడలో జరుగుతున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం సర్వేపై రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. సర్వేపై రైతులు సంతృప్తి వ్యక్తం చేయగా, రైతుల సమక్షంలోనే సర్వే చేయాలని తెలిపారు. ఆయన వెంట ఏడీఏ టి.త్రివిక్రమరావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, హెచ్‌డీటీలు రామకృష్ణ, చిన్నారావు, సర్వేయర్ సాయికుమార్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై ఆరా

రాజాం సిటీ: రైస్ మిల్లర్లు రైతులకు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని కోరారు. మంగళవారం మండల పరిధిలోని కంచరాం ఆర్‌బీకేను సందర్శించిన ఆయన ధాన్యం కొనుగోలుపై సిబ్బందిని ఆరాతీశారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, చెల్లింపులు జరిపారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జయలక్ష్మి, లక్ష్మీనరసింహ రైస్‌మిల్లుల యాజమాన్యంతో సమావేశమై ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లుకు తరలిస్తున్న ధాన్యాన్ని అన్‌లోడ్ చేసే విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బి.శంకరరావు ఉన్నారు

అంగరంగ వైభవంగా.. పెదపోలమ్మ సంబరాలు



ఆకట్టుకున్న బళ్ల వేషాలు



మహిళల కోలాటం



అమ్మవారి ఘటాలతో నడిచివెళ్తున్న మహిళలు

- ఘనంగా పెదపోలమ్మ సంబరాలు
- ఉత్సవాలకు పోటెత్తిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బొబ్బిలి మండలం, పక్కి గ్రామంలో పెదపోలమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదేళ్లకోసారి మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం నిర్వహించిన సిరిమానోత్సవం కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. జాతరలో భాగంగా చేపట్టిన పలు బళ్ల వేషాలు, మహిళల కోలాటం, యువతీ, యువకుల నృత్య ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఉత్సవ శోభను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతుండడం విశేషం. – బొబ్బిలి రూరల్



సంబరాలకు వచ్చి, విందు ఆరగిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



సంబరాలకు హాజరైన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి



పెదపోలమ్మ సంబరాలకు హాజరైన డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



వీధుల్లో తిప్పుతున్న అంజలి రథం

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



తెర్లాం: సిబ్బంది, లబ్ధిదారులకు సూచనలిస్తున్న జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి



రాజాం: ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ రమణమూర్తి

- రాజాం నియోజకవర్గంలో 2,123 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు
- జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి

రాజాం: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి మంగళవారం సమావేశమై, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. మండలాల వారీగా నిర్మాణాలపై అధికారులను ఆరాతీసిన హౌసింగ్ పీడీ మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో మొత్తం 7,443 జగనన్న ఇళ్ల నిర్మాణాలు మంజూరు కాగా, వీటిలో 2,123 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో మొత్తం 51 లే అవుట్లలో నిర్మాణాలు జరుగుతున్నాయని, అన్ని చోట్ల మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ జి.గౌరీశంకర్, ఏఈలు వేణుగోపాలరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది రోజు గృహ ప్రవేశాలు..

తెర్లాం: ఉగాదిలోగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, ఉగాది నాడు సామూహిక గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి కోరారు. మండలంలోని లోచర్ల, తెర్లాం గ్రామాల్లోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించిన ఆయన నిర్మాణానికి అవసరమైన మెటీరియల్, ఆర్థికసాయం ప్రభుత్వం అందజేస్తోందని, దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. లోచర్ల జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో విద్యుత్ సమస్య ఉందని లబ్ధిదారులు తెలపగా స్పందించిన పీడీ ట్రాన్స్‌కో ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎస్ఈ స్పందిస్తూ తెర్లాం విద్యుత్ ఏఈ సెలవులో ఉన్నారని, రెండు రోజుల్లో ఇన్‌చార్జ్ ఏఈని నియమించి సమస్య పరిష్కరిస్తానని సమాధానమిచ్చారు. ఆయన వెంట ఈఈలు జి.శంకరరావు, బి.శ్రీనివాసరావు, తెర్లాం హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మీనాక్షి ఉన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం: స్థానిక క్రాంతిపథం కార్యాలయం వద్ద మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు మంగళవారం మునగ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ లావేటి సులోచన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు అంతా ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీనికోసం ఆయన అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మండలంలో 15 వేల మంది మహిళలకు విడతల వారీగా మునగ మొక్కలు అందిస్తున్నామని, ఒక్కో సభ్యురాలికి ఐదు మొక్కలు చొప్పున ఇస్తున్నామని వివరించారు. వీటిని ఇంటి ఆవరణలోని పెరడు, పొలాల్లో వేసి అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి. నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ వి.చిన్నంనాయుడు, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎంలు టి.దధికుమార్, కె.హేమలత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్. అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందుకే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో మంగళవారం సమావేశమైన ఆయన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుపై ఆరాతీశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి, మెరుగైన వైద్యసేవలందిస్తున్నామని ఆయన తెలిపారు. అవసరమైన రోగులకు స్కేనింగ్ పరీక్షలు కూడా చేస్తున్నామని వివరించారు. దీర్ఘకాలిక సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు ఉచితంగా మందులు సైతం అందిస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు బాగుండాలన్న సదుద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేసి, ఆయన ఆశయం నెరవేరేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో సరిహద్దుల గుర్తింపు



లింగాపురంలో చేస్తున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న కేఆర్‌సీ ఎస్‌డీసీ సూర్యనారాయణ

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా రైతుల సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు చేపట్టాలని కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) ఆర్‌సీహెచ్ సూర్యనారాయణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ త్రివిక్రమరావు సూచించారు. మంగళవారం మండలంలోని లింగాపురం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను వారు పరిశీలించారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌పై తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, మండల సర్వేయర్ వెంకటరమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు సచివాలయ సర్వేయర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో భూముల సరిహద్దులు గుర్తిస్తున్నప్పుడు తప్పనిసరిగా ఆయా భూములకు సంబంధించిన రైతులను దగ్గర ఉంచి సరిహద్దులు గుర్తించాలన్నారు. ఇలా చేయడం ద్వారా భవిష్యత్‌లో భూ సరిహద్దు సమస్యలు తలెత్తవన్నారు. గ్రామాల్లోని రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములు, బంజరు, పోరంబోకు భూములను కూడా గుర్తించాలన్నారు. భూముల రీసర్వేను మరింత వేగవంతం చేయాలని ఎస్‌డీసీ మండల అధికారులను ఆదేశించారు. రైతులు కూడా సర్వేకు సహకరించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆయా వార్డుల్లోని ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు కోరారు. మంగళవారం పట్టణ పరిధిలోని కొండంపేటలో పర్యటించిన ఆయన పలు సమస్యలపై ఆరాతీశారు. కాలువల్లో మురుగు తీయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని స్థానికులు కోరగా, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు..

సారా నియంత్రణపై అవగాహన

బొబ్బిలి: మండలంలోని చిత్రకోట బొడ్డవలస పంచాయతీ, వెలగవలస గ్రామంలో సారా నియంత్రణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ మాట్లాడుతూ సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సారా తాగిన ఎంతోమంది జీవితాలు నాశమయ్యాయని, ఇప్పటికైనా సారా తయారు చేయడం, తాగడం మానుకోవాలని హితవు పలికారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

సంతకవిటి: బాల్యవివాహాలు చేసుకోవడం, చేయించడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ జనార్ధనరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్యవివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులెవరూ పనిలోకి వెళ్లకూడదని, బాగా చదువుకోవాలని తెలిపారు. మైనర్ తీరిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టి, ఆయా వ్యవస్థల నిర్మూలనపై ప్రజలకు చైతన్యం కలిగించారు.

పౌష్టికాహారం పంపిణీ

తెర్లాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి హాజరైన 40 మంది గర్భిణులకు భగవాన్ శ్రీసత్యసాయిబాబా సేవా మండలి సమకూర్చిన పౌష్టికాహారాన్ని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ప్రతీ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల నుంచి గర్భిణులు వస్తుండగా, వారికి ఇలా పౌష్టికాహారం అందిస్తుండడం గమనార్హం.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రేగిడి మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన ముగడ సత్యవతికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల వ్యాధులు నయమవుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని పలువురు పేదలకు కూడా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందిస్తుండడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథానికి నిదర్శమన్నారు. గతంలో టీడీపీ కార్యకర్తలకు, జన్మభూమి కమిటీలకు మాత్రమే సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేదన్నారు. ఇప్పుడు సామాన్యులు కూడా తమ వైద్య ఖర్చుల నిమిత్తం కోరిన వెంటనే ఈ ఆర్థిక సాయం అందజేయడం జరుగుతోందన్నారు. సత్యవతి గతంలో అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకోగా, ఆమెకు రూ.70 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి



దుప్పలపూడి ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలుపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సచివాలయ ఉద్యోగి పనిచేయాలని ఎంపీడీఓ రమామణి సూచించారు. మండలంలోని దుప్పలపూడి గ్రామసచివాలయం, ఆర్‌బీకేలను మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి రికార్డులు పరిశీలించడంతో పాటు ధాన్యం కొనుగోలుపై ఆరాతీశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడం, ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న సదుద్దేశంతోనే సచివాలయాలు ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులంతా చిత్తశుద్ధి, నిబద్ధతతో ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా చూడాలని, ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పీఆర్ డీఈఈ అప్పారావు

బాడంగి: మండలంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మండలంలోని 8 సచివాలయాల పరిధిలో మొత్తం 34 రోడ్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, వాటికి సంబంధించి, వర్క్ ఎస్టిమేషన్లు ఇవ్వాలని కోరారు. అలాగే నిర్మాణ దశలోని సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలు, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఇరువర్గాలపై కొట్లాట కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధి డీఆర్‌ఎస్‌వలస గ్రామంలో ఇరువర్గాల కొట్లాటపై పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై రవికిరణ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన టి.నారాయణరావు, జి.అప్పలనాయుడులు కళ్లానికి వెళ్లే దారి విషయమై గొడవ పడ్డారు. దీంతో ఇరువురి కుటుంబాల్లోని వ్యక్తులు తగాదాలో గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు అందజేసిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గ్రామ సచివాలయాల్లో సమగ్ర వివరాలు

సంతకవిటి: గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఉండాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. మంగళవారం మండలంలోని గోళ్లవలస, వాసుదేవపట్నం గ్రామ సచివాలయాలతో పాటు అక్కడి రైతు భరోసా కేంద్రాలను పరిశీలించిన ఆయన ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలను గోడలపై ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సంతకవిటి: మండలంలోని పలు గ్రామాలు నుంచి రైతుల ద్వారా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తహసీల్దార్ ఎ.సులోచనారాణి తెలిపారు. మంగళవారం స్థానిక గాయత్రి మోడరన్ రైస్‌మిల్లును పరిశీలించిన ఆమె రైతులు తరలిస్తున్న ధాన్యాన్ని సకాలంలో దించి, వారికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూడాలని మిల్లు యాజమాన్యాన్ని కోరారు. మండలంలో మొత్తం 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 33 శాతం మేర ధాన్యం సేకరించినట్లు ఆమె వివరించారు.

సజావుగా వలంటీర్ల ఇంటర్వ్యూ

తెర్లాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ల ఇంటర్వ్యూ మంగళవారం సజావుగా జరిగింది. మండలంలోని ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి సంబంధించి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. తొలుత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, వారికి ప్రభుత్వ పథకాలపై ఏ మేర అవగాహన ఉందో తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. ఎంపిక జాబితాను రెండు రోజుల్లో తెలియజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వంగర: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడైనా పొట్టేలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు లక్ష్మీపేట పోలీస్ అవుట్ పోస్టును మంగళవారం తనిఖీ చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండగ వేళ దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణాలు చేసేటప్పుడు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ఇళ్లల్లోని విలువైన వస్తువులను భద్రపరచుకోవాలని తెలిపారు.